# అపాత్రదానం



*అభిగమ్యకృతే దానం*
*త్రేతాస్వాహూయదీయతే*
*ద్వాపరే యాచమానాయ*
*సేవయాదీయతే కలౌ*

**భావం:** కృతయుగంలో ఒకరి వద్దకు వెళ్ళి దానం చెయ్యాలి. త్రేతాయుగంలో ఒకరిని పిలిచిదానమివ్వాలి. ద్వాపరంలో అడిగిన వారికి దానం చెయ్యాలి. కలియుగంలో సేవకు ప్రతిఫలంగా ఇవ్వాలి.

ఆనందవర్ధనుడనే మహారాజు ధర్మాత్ముడు. దయామయుడు. తన రాజ్యంలో ప్రజలందరూ సుఖంగా ఆనందంగా ఉండాలని ఆయన కోరిక. ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు ఆయన రాజ్యంలో మారువేషంలో పర్యటించాడు. రాజాస్థానంలో కొందరు ధనవంతులు పెద్ద మేడలలో విలాసంగా జీవిస్తున్నారు.

కానీ అనేకమంది తాటాకుతో నేసిన ఇళ్ళలో చిరుగు బట్టలతో పూట గడవడం కష్టంగా ఉన్నారు. నేత పని వారికి నెల మొత్తం కష్టపడి చీర నేస్తే వారం రోజులకే భుక్తి దొరుకుతున్నట్లుంది. రైతులకు కష్టానికి తగ్గ ఫలం లేదు. అదే విధంగా కుమ్మరులూ, కంసాలులూ మొదలైన అన్ని వృత్తులవారూ దారిద్ర్యంలో మగ్గిపోతున్నారు.

మహారాజు గుండె కరిగిపోయింది. ఆయన వెంటనే ఒకయాగం తలపెట్టాడు. రాజ్యంలోని ప్రజలందరినీ ఆహ్వానించాడు. నెలరోజుల పాటు పంచభక్ష్య పరమాన్నాలతో సంతర్పణ జరిగింది. యాగం పూర్తయిన తరువాత ప్రజలందరికీ రాజ బొక్కసంలోని ధనాన్ని విరివిగా పంచి పెట్టాడు. ప్రజలందరూ ఆయనను దీవించి, కృతజ్ఞతలు చెప్పి, సంతోషంగా ఇళ్ళకు వెళ్ళి పోయారు. మహారాజు మహదానంద భరితుడయ్యాడు.

ఆరు నెలలు గడిచాయి. మహారాజు మళ్ళీ మారువేషంలో పర్యటించాడు. ప్రజల జీవితంలో మార్పు కనబడలేదు. తాను దానం చేసిన ధనం తక్కువా అని ఆయనకు అనుమానమొచ్చింది. ఇంకొక మారు రాజ్యంలో ప్రజలందరినీ పిలిచి ముందుసారికన్నాఎక్కువ ధనమిచ్చాడు. ఇక ప్రజలందరికీ సుఖ సంతోషాలే అనుకున్నాడు.

రెండవసారి ఎక్కువ ధనమిచ్చినందువల్ల దాన ఫలితాల త్వరలోనే కన్పిస్తాయనుకున్న మహారాజు మూడు నెలలకే దేశ సంచారం చేశాడు. ప్రజల జీవన విధానంలో మార్పులేదు. తాను బస చేసిన ఇంటి యజమాని " మీ దేశమేలే రాజు ధర్మాత్ముడనీ, మీకు చాలా ధనం దానం చేశాడనీ విన్నాను. కానీ మీ దారిద్ర్యం తీరినట్లు లేదే" అన్నాడు.

ఆయన మహారాజు అని తెలియని గృహస్థు " మహారాజు ధనమిచ్చిన మాట వాస్తవమే. కానీ వస్తువుల ధరలు పెరిగిపోయాయి. ధనం ఎక్కువైనా కొని తీరవలసిన ఆహార పదార్థాలు లభ్యం కావడమే లేదు. అందుకే మీకు సామాన్యమైన భోజనమే పెట్టగలిగాము" అన్నాడు.

మహారాజుకు మతిపోయింది. ఆయన వెంటనే అరణ్యంలోని తన గురువు దగ్గరకు వెళ్ళి విషయమంతా చెప్పాడు. "గురువర్యా ప్రజల ఆనందానికై దానధర్మాలు చేశాను. కానీ దేశంలో ప్రజల జీవితంలో మార్పు లేదు." అన్నాడు. జ్ఞానియైన గురువు "ఆనందవర్ధనా, యుగ ధర్మాలను మరిచిపోయి దానధర్మాలు చేశావు. కృతయుగంలో అందరూ ధర్మాత్ములు. అటువంటి వారి దగ్గరకు వెళ్ళి దానం చెయ్యాలి. వారు తమతమ ధర్మాలలో నిమగ్నమై ఉంటారు. త్రేతాయుగంలో పిలిచి దానం మివ్వాలి. ద్వాపరంలో అడిగిన వారికివ్వాలి. ఇది కలియుగం. తప్పనిసరై తప్ప ఎవరూ తమ ధర్మం నిర్వర్తించరు. నీవు పుష్కలంగా ధనమివ్వగానే ఎవరి వృత్తి వారు మానేశారు. వస్తువుల ఉత్పత్తి ఆగిపోయింది. అందువలన ధరలు పెరిగిపోయాయి. ప్రజలలో సోమరితనం పెరిగింది. నీవు ప్రతి ఒక్కరికీ పనికి తగిన ప్రతిఫలం లభించేలా ఏర్పాటు చేయి." అన్నాడు.

ఆనంద వర్ధనుడు కలియుగ ధర్మాన్ని అనుసరించి అందరూ పనిచేసి పనికి తగిన ఆదాయం పొందేలా చూశాడు. రాజ్యం సుభిక్షమైంది.

నాలుగు యుగాలు ఉన్నాయని రుజువు చూపలేం కానీ ప్రస్తుతం కలియుగ ధర్మమున్న కాలం నడుస్తోంది. పాలకులు ఉచిత జనాకర్షక పథకాలను వదలి ప్రజలు కష్టపడి అభివృద్ధి పథంలో నడిచేలా చేయాలేమో కదా.

******